# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1 రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.**

**2. భారత నౌకాదళ దినోత్సవం-2024 కొనసాగింపు కార్యక్రమాల విన్యాసాలు రేపు విశాఖపట్నంలో జరుగుతాయి.**

**3. విజయవాడలో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రేపు ప్రారంభిస్తారు.**

**4. ఇంధన రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**

==========================

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరంలో 5కోట్ల రూపాయలతో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం, అభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు.

వాయిస్ .. 28 సెకన్లు

---------------------------

భారత నౌకాదళ దినోత్సవం-2024 కొనసాగింపు కార్యక్రమాల విన్యాసాలను రేపు విశాఖపట్నం సముద్ర తీరంలో నిర్వహించనున్నారు. ఈ ముగింపు వేడుకలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. 1971 ఇండో-పాక్ యుద్ధంలో భారత నౌకాదళం పోషించిన పాత్రకు గుర్తుగా ప్రతి సంవత్సరం డిసెంబరు 4వ తేదీన ఈ కార్యక్రమాలు విశాఖపట్టణంలో జరగడం ఆనవాయితీగా వస్తోంది. గత ఏడాది ఒడిసా రాష్ట్రం పూరీలో జరిగిన ఈ కార్యక్రమాలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిధిగా హాజరయ్యారు. వాటి కొనసాగింపు వేడుకలు విశాఖపట్నంలో రేపు జరగనున్నాయి.

---------------------------

విజయవాడ పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రేపు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించనున్నారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ నిన్న సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి ప్రారంభించి, వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులతో దృశ్య మాధ్యమ విధానంలో సంభాషిస్తారని తెలిపారు. మంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు.

---------------------------

ఇంధన రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. అమరావతి సచివాలయంలో ఏపీ జెన్కో, ట్రాన్స్కో 2025 డైరీ, క్యాలెండర్లను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ట్రాన్స్కో ద్వారా 15 వేల 729 కోట్ల రూపాయలతో 71 విద్యుత్ ఉపకేంద్రాలు, 4 వేల 696 కిలోమీటర్ల ట్రాన్స్మిషన్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ వినియోగం అధికంగా ఉన్న సమయంలో ఇబ్బందులను పరిష్కరించేందుకు దశల వారీగా 5 వేల మెగావాట్ల విద్యుత్ నిల్వ ప్రాజెక్టులను ఏపీ జెన్కో చేపట్టనుందని అన్నారు. రాష్ట్ర విద్యుత్ రంగంలో ఇది కీలకమైన నిర్ణయమని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లాలో 15 లక్షల మెట్రిక్ టన్నుల ఉచిత ఇసుకను సరఫరా చేశామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. రాజమహేంద్రవరంలో కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలో 2 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని కొనుగోలు చేసి 580 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశామని అన్నారు. పల్లె పండుగ కార్యక్రమం కింద చేపట్టిన అభివృద్ధి పనులు సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ తెలుపుతూ,

వాయిస్ ..28 సెకన్లు

---------------------------

షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమీషన్ ఛైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రా రెండు రోజుల పాటు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పర్యటిస్తారని జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సాయంత్రం వై.ఎస్.ఆర్. జిల్లా నుండి నెల్లూరు చేరుకుంటారని చెప్పారు. రేపు ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై వర్గీకరణకు సంబంధించి వివిధ వ్యక్తులు, సంస్థల నుంచి విజ్ఞాపనలు,వినతి పత్రాలు స్వీకరిస్తారని తెలిపారు.

---------------------------

ఉత్తర ప్రదేశ్లోని ప్రయాగ్ రాజ్లో జరగనున్న కుంభమేళా ప్రాంతంలో కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా ఉండేలా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు కేంద్ర సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ తెలిపింది. మేళాకు భారీ సంఖ్యలో హాజరయ్యే ప్రజలకు నెట్వర్క్ అందేలా చూడాలని టెలికాం సర్వీస్ ప్రొవైడర్లను ఆదేశించినట్లు పేర్కొంది. ఇందులో భాగంగా ప్రయాగ్ రాజ్ నగరం అంతటా 126 కిలోమీటర్ల మేర ఆప్టికల్ ఫైబర్ ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించింది. అదనంగా, 328 కొత్త టవర్లు ఏర్పాటు చేశామని తెలిపింది. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, విమానాశ్రయాలు వంటి ప్రధాన రవాణా కేంద్రాలు, పార్కింగ్ స్థలాలు సహా కీలకమైన ప్రదేశాలలో టెలికాం సేవలు అందుబాటులో ఉండేలా 53 సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మంత్రిత్వ శాఖ తెలియచేసింది.

---------------------------

హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం విశ్వహిందూ పరిషత్ హైందవ శంఖారావం సభను నిర్వహిస్తోందని గన్నవరం శాసనసభ సభ్యులు యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. కృష్ణాజిల్లా కేసరపల్లిలో నిర్వహించనున్న సభ ఏర్పాటు పనులను ఆదోని శాసన సభ్యులు పార్థసారథి, విశ్వ హిందు పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు దుర్గా ప్రసాద్ రాజుతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం వెంకట్రావు మాట్లాడుతూ, సుమారు 30 ఎకరాల స్థలంలో సభను నిర్విస్తున్నామని చెప్పారు, హైందవ శంఖారావానికి 150 మంది స్వామీజీలు హాజరవుతారని తెలుపుతూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో సప్పర్ల నుండి దుర్గం గొల్లపల్లి వరకు నిర్మిస్తున్న రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని జీకే వీధి మండలం సప్పర్ల, దారకొండ, చట్రాపల్లి తదితర గ్రామాలను కలెక్టర్ నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నిర్మాణం పూర్తయితే పలు గ్రామాలకు రవాణా సౌకర్యం కలుగుతుందని, త్వరితగతిన పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుకోవాలని సూచించారు. సప్తర్ల గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.

---------------------------

ఏపీఆర్టీసీ ద్వారా ప్రజల ఇంటివద్దకే వస్తువులను డెలివరీ చేస్తున్నామని భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్ పిఎన్ బీ సత్యనారాయణమూర్తి తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ అవగాహన ర్యాలీని ఈరోజు నిర్వహించారు.ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ సందర్భంగా వినియోగదారులకు అందుబాటులో ఉండేలా డోర్ డెలివరీ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. బస్టాండ్ నుంచి పది కిలోమీటర్ల వరకు వస్తువులను నామమాత్రపు ధరతో అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు.

---------------------------

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఈ నెల 9వ తేదీన మెగా ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ మెగా ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 90 సంస్థలు పాల్గొంటున్నాయని, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఉద్యోగ మేళాకు అభ్యర్థులు తగిన ధృవపత్రాలతో హాజరుకావాలని తెలిపారు.

---------------------------

యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి మణిప్రసాద్ తెలిపారు. తిరుపతిజిల్లా చంద్రగిరిలోని నారావారిపల్లిలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించిన ఉద్యోగ మేళాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మణి ప్రసాద్ మాట్లాడుతూ, ఉద్యోగ మేళాలో 20 ప్రయివేటు సంస్థలు పాల్గొంటున్నాయని తెలిపారు. నిరుద్యోగ యువతకు శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.

======================